

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 221 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం, 11, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# కార్పొరేషన్ చైర్మన్ పదవులపై కోట్ల లాబీయింగ్ ?



**రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని కార్పొరేషన్లు, ఫెడరేషన్లు, ఇతర నామినేటెడ్ సంస్థల చైర్మన్ పదవుల భర్తీ మరోసారి రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. తొలి విడతలో నియమితులైన సుమారు 40 మంది చైర్మన్ల పదవీకాలం ముగియడంతో రెండో విడత** నియామకాలపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. పాత చైర్మన్లతో పాటు కొత్త ఆశావహులు కూడా అవకాశాల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వందకు పైగా నామినేటెడ్ పదవులను భర్తీ చేసే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో కీలక పదవుల కోసం భారీ లాబీయింగ్ జరుగుతోందన్న ప్రచారం కూడా వినిపిస్తుండగా, దీనిపై కాంగ్రెస్ పార్టీ లేదా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారిక స్పందన వెలువడలేదు.

- హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

2

తొలి విడత చైర్మన్ల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాల కసరత్తు

పాతవారితో పాటు కొత్త ఆశావహుల మధ్య తీవ్ర పోటీ

వందకు పైగా నామినేటెడ్ పదవుల భర్తీకి రంగం సిద్ధం

కీలక కార్పొరేషన్లపై కాంగ్రెస్ అధిష్ఠానంలో మంతనాలు

భారీ లాబీయింగ్ జరుగుతోందన్న రాజకీయ ప్రచారం

రూ.100 కోట్ల పార్టీ ఫండ్ ప్రచారంపై అధికారిక స్పందన కరువు

తుది జాబితాపై ఉత్కంఠ.. ఎవరికి దక్కనున్నాయి పదవులు?

## కాంగ్రెస్ ప్రచారాసభగా రైతు ఆశీర్వాద సభ

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం

తెలంగాణలో 20 ఎంపి సీట్లు గెలిపిస్తే రాహుల్ ప్రధాని

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌దే గెలుపు

కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా తొక్కివేస్తా

బావామర్దులు కలసి ఊరుమీద పడి తిరుగుతున్నారు

కెసిఆర్‌ను ఫామ్‌హౌజ్‌కే పరిమితం చేసేశాం

మధిర రైతు ఆశీర్వాద సభలో భరోసా నిధులు విడుదల

సభలో సిఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

6



## సోషల్ మీడియా దుష్ప్రచారాలపై ఆందోళన

- ఏపీ కేబినెట్‌లో సీరియస్‌గా చర్చ - పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన డిజిపి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు సిఎం ఆదేశం



7

## టిఆర్ఎస్‌ను గెలిపిస్తే.. అక్క రాజ్యం చూపిస్తా

తమ ప్రభుత్వంలో రైతుకు కుర్చీ వేసి గౌరవిస్తాం

మహిళల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తాం

గిరిజనుల సమస్యలై ఢిల్లీ దాకా కొట్లాడుతాం

పాంచజన్యంతో ముందుకు వెళతామన్న కవితక్క

2



## సీఐ శ్రీకాంత్ రెడ్డి,ఎస్సై యశోదర్‌కు జై భీమ్ టీవీ ఆధ్వర్యంలో ఘన సన్మానం

తుకారాం గేట్(జై భీమ్ న్యూస్)

తుకారాం గేట్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీకాంత్ రెడ్డి,ఎస్సై యశోదర్ గారిని వారి ఆత్మీయ ఆహ్వానం మేరకు సీఐ ఛాంబర్‌లో జై భీమ్ టీవీ వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాన్ని అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. పోలీసు శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను అభినందిస్తూ, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజా ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత ఎస్.ఎస్. రాజు, రవి రాజు తదితరులు పాల్గొని సీఐ శ్రీకాంత్ రెడ్డి గారికి, ఎస్సై యశోదర్ గారికి శుభాకాంక్షలు తెలిపారు.



జై భీమ్
POWER OF PEOPLE

# మెదక్ జిల్లాలో బీజేపీ సర్పంచ్ సస్పెన్షన్

సర్పంచ్ భర్త అక్రమాల నేపథ్యంలో ఆరు నెలల పాటు సస్పెన్షన్



**మెదక్ జిల్లా(జై భీమ్ న్యూస్)**

చేగుంట మండలం పొలంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మిని ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ వ్యవహారాల్లో సర్పంచ్ భర్త కొండి స్వామి జోక్యం చేసుకోవడంతో పాటు హరితహారం మొక్కలను ధ్వంసం చేయడం, పంచాయతీ కార్యాలయ ఫర్నిచర్‌ను పాడుచేయడం, గ్రామంలోని మరుగుదొడ్లను ధ్వంసం చేసి వాటికి తాళాలు వేయడం వంటి అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజా ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యం, పంచాయతీ పరిపాలనకు విఘాతం కలిగించే చర్యలు చోటుచేసుకున్నాయని గుర్తించిన జిల్లా యంత్రాంగం, సంబంధిత నిబంధనల ప్రకారం సర్పంచ్ కొండి రాజ్యలక్ష్మిని ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారగా, గ్రామ పంచాయతీల్లో ప్రజా ఆస్తుల పరిరక్షణ, స్థానిక సంస్థల పాలనలో జవాబుదారీతనం ఉండాలని అధికారులు స్పష్టం చేశారు.

## నాలుగో తరగతి ఉద్యోగులకు రూ.15,600 కనీస వేతనం అమలు చేయాలి

సి.ఏ.ఓ నాగార్జునకు వినతిపత్రం అందజేసిన ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం



**హైదరాబాద్,జూలై 10 (జై భీమ్ న్యూస్)**

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (సి.ఏ.ఓ) నాగార్జునకు ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. నరసింహ, జాతీయ ఆరోగ్య మిషన్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీవో నెం.60 ప్రకారం 2021 నుంచి నాలుగో తరగతి ఉద్యోగులకు నెలకు రూ.15,600 కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ చట్టాల ప్రకారం ఉద్యోగుల వాటాలతో పాటు యాజమాన్య వాటాలను కూడా ప్రతి నెల సక్రమంగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని, 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన "సమాన పనికి సమాన వేతనం" తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నాలుగో తరగతి ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ శాలరీ అమలు చేయడం, హెల్త్ కార్డులు అందించడం, సంవత్సరానికి 35 క్యాజువల్ సెలవులు మంజూరు చేయడం, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వతీకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ఎస్ఎన్‌వో రమేష్, కాంటింజెంట్ వర్కర్ సురేష్, మెడికల్ ఆఫీసర్ అసిస్టెంట్ అజ్మీర విజయ నాయక్, శ్రీనివాస్, వై. రమేష్ కుమార్, సరూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫిల్మ్ నగర్‌లో దనటుడి ఇంట్లోకి దూసుకొచ్చిన కారు

హైదరాబాద్,జూలై10(జై భీమ్ న్యూస్): హైదరాబాద్ ఫిలింనగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి నేరుగా టాలీవుడ్ నటుడు ధర్మ నివాసంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి గేటు, ప్రహారీ గోడ ధ్వంసమయ్యాయి. అయితే ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న యువకులు అతివేగంగా వాహనాన్ని నడపడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు రోడ్డుపై నుంచి నేరుగా నటుడు ధర్మ ఇంటి ప్రాంగణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఘటన సమయంలో కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ధర్మ కుటుంబ సభ్యులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# కార్పొరేషన్ చైర్మన్ పదవులపై కోట్ల లాబీయింగ్..?

40 మంది పదవీకాలం ముగియడంతో మళ్లీ రేసులో పాతవారే..!
మరో విడత నామినేటెడ్ పదవుల భర్తీపై కాంగ్రెస్‌లో జోరుగా కసరత్తు
ఐదేళ్ల పదవీకాలం కోసం వినతులు
పైరవీలపై రాజకీయ వర్గాల్లో చర్చ
డాక్టర్, బరిగెల శివ

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని కార్పొరేషన్లు, ఫెడరేషన్లు, ఇతర నామినేటెడ్ సంస్థల చైర్మన్ పదవులు మరోసారి రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారాయి. తొలి విడతలో నియమితులైన సుమారు 40 మంది కార్పొరేషన్, ఫెడరేషన్ చైర్మన్ల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై కాంగ్రెస్ పార్టీలో తీవ్ర కసరత్తు జరుగుతోంది. ఒకవైపు కొత్త ఆశావహులు, మరోవైపు ఇప్పటికే పదవులు నిర్వహించిన వారు తిరిగి అవకాశం కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కొత్త నామినేటెడ్ పదవుల భర్తీపై మంతనాలు కొనసాగుతున్నట్లు సమాచారం. అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈరవత్రి అనిల్ కుమార్, నిర్మలా జగ్గారెడ్డి, మెట్టు సాయికుమార్, కల్వ సుజాత, ఎం.ఏ. ఫహీం, ముత్తినేని వీరయ్య, పటేల్ రమేష్ రెడ్డి, రియాజ్, అన్వేష్ రెడ్డి తదితరులకు మళ్లీ అవకాశం దక్కే అవకాశాలపై పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొందరిని అదే సంస్థలకు, మరికొందరిని ఇతర కార్పొరేషన్లకు మార్చే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఖాళీగా ఉన్న ఇతర కార్పొరేషన్లు, ఫెడరేషన్లు, బోర్డులు, సంస్థలతో కలిపి వందకు పైగా నామినేటెడ్ పదవులను భర్తీ చేసే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పౌరసరఫరాలు, గృహనిర్మాణం, ఆర్టీసీ, బేవరేజెస్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్, మూసీ రివర్ ఫ్రంట్, వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థలు వంటి కీలక సంస్థలకు రాజకీయ ప్రాధాన్యం కలిగిన నేతలను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ నియామకాల చుట్టూ మరోసారి భారీ లాబీయింగ్ జరుగుతోందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. ఇప్పటికే పదవీకాలం పూర్తి చేసిన కొందరు మరో మూడేళ్లు ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తమకు ఐదేళ్లపాటు కొనసాగించేలా అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలను కోరుతున్నట్లు సమాచారం. మరోవైపు కొత్త ఆశావహులు ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు చెబుతున్నారు.

**రూ.100 కోట్ల ఫండ్..? రాజకీయ వర్గాల్లో ప్రచారం**

కార్పొరేషన్ చైర్మన్ పదవుల కోసం భారీగా పార్టీ ఫండ్ సేకరణ జరుగుతోందంటూ రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఒక్కో కీలక కార్పొరేషన్ చైర్మన్ పదవి కోసం రూ.100 కోట్ల వరకు పార్టీ ఫండ్ ఇవ్వడానికి కొందరు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారంపై కాంగ్రెస్ పార్టీ గానీ, ప్రభుత్వం గానీ ఎలాంటి అధికారిక స్పందన ఇవ్వలేదు. ఈ ప్రచారంలో ఎంతవరకు వాస్తవం ఉందన్నది స్పష్టత రావాల్సి ఉంది. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకుంటుండటంతో ఎవరికి అవకాశం దక్కుతుంది..? పాతవారికే మరోసారి ప్రాధాన్యం ఇస్తారా..? లేక కొత్త ముఖాలకు అవకాశం కల్పిస్తారా..? అన్నది రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

## టిఆర్ఎస్‌ను గెలిపిస్తే.. అక్క రాజ్యం చూపిస్తా

తమ ప్రభుత్వంలో రైతుకు కుర్చీ వేసి గౌరవిస్తాం
మహిళల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తాం
గిరిజనుల సమస్యలై ఢిల్లీ దాకా కొట్లాడుతాం
పాంచజన్యంతో ముందుకు వెళతామన్న కవితక్క

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై10(జై భీమ్ న్యూస్):**

ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేనను గెలిపిస్తే.. రైతును రాజును చేసి చూపిస్తానని ప్రజలకు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ వేయిస్తామని తెలిపారు. త్వరలోనే మహిళల కోసం ఒక ప్రత్యేకమైన వినూత్న ఆలోచనను చేశానని చెప్పారు. దీనిని త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు. అన్న రాజ్యం కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని తెలిపారు. కొత్త పార్టీలో మార్పులు ఉంటాయని.. 'పాంచజన్యం' పేరుతో ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ఎంత పెద్ద సమస్యకైనా మొదటి అడుగుతోనే పరిష్కారం.. తన ప్రయాణానికి మీ సహకారం కావాలని ప్రజలను కోరారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త గంగారం గ్రామం ఆదివాసి నాయకపోడు గ్రామాల్లో సమస్యలు వారి జీవన విధానాన్ని తెలంగాణ రక్షణ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాజకీయాల కోసం రాలేదని.. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మీ ముందుకు వచ్చానని అన్నారు. వెనకబడిన ఆదివాసీ గిరిజనుల కోసమే 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని స్థాపించానని వివరించారు. సమాజంలో ఉన్న వెనకబడిన వ్యవస్థను మార్చడానికే ఆడబిడ్డగా ధైర్యంగా తాను ముందుకు వచ్చానని పేర్కొన్నారు. మీ గ్రామానికి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా ఉంది.. గ్రామ దేవతల దర్శనం కల్పించిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మార్పు రాలేదు.. నిరుద్యోగం, కరెంట్ కష్టాలు ఇంకా పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకపోడు జాతిని 'గోండు నాయకపోడు' అని పిలవడం తీవ్ర బాధాకరమని అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు పేరు లేకపోవడం దురదృష్టకరం.. గిరిజనుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతామని పేర్కొన్నారు. తెలంగాణలో ఆదివాసీకి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం లేదని అన్నారు. బ్యాంకులు లూటీ చేసిన వారి అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్.. గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వట్లేదు? అని ఆ పార్టీ నేతలను కవిత సూటిగా ప్రశ్నించారు. విదేశాల తరహాలో ఇక్కడి ఆదివాసీలకు రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు బ్యాంక్ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి.. ఇది వారి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఎస్టీలకు కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు.

## తీరం వైపు దూసుకొస్తున్న తుఫాన్

అప్రమత్తమైన చైనా ప్రభుత్వం

**బీజింగ్,జూలై10(జై భీమ్ న్యూస్):**

చైనా వైపు మరో రక్కసి తుఫాను దూసుకొస్తోంది. తూర్పు తీరంవైపు బావి తుఫాను వస్తోందని అక్కడి వాతావరణ శాఖ పేర్కొంది. తుఫాను తీవ్రత అంతకంతకూ పెరుగుతున్న రీత్యా వాతావరణ శాఖ గురువారమే ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. శనివారం తుఫాను మొదట తైవాన్‌ను తాకి అనంతరం చైనాలోని ఫుజియన్, జెజియాంగ్ ప్రావిన్సుల్లో తీరాన్ని తాకనుంది. ప్రభావిత ప్రావిన్సుల్లో 40 సెంటీమీటర్ల వరకూ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేశారు.రక్కసి తుఫాను దూసుకొస్తున్న నేపథ్యంలో చైనా ప్రభుత్వం అప్రమత్తమైంది. తీరానికి సమీపంలోని 17 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. 1.70 లక్షల మంది విపత్తు నిర్వహణ సిబ్బందిని సిద్ధంగా ఉంచింది. తీర ప్రాంతాలతో పాటూ బీజింగ్ వరకూ తుఫాను ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం మధ్యాహ్నమే రాజధాని బీజింగ్‌లో అధికారులు ఎమ్జ్గం÷న్సీని ప్రకటించారు. స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. క్రీడాకార్యక్రమాలను వాయిదా వేశారు. ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు, గాలులతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తైవాన్‌లో కూడా హైఅలర్ట్ ప్రకటించారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికే విమాన సర్వీసులు నిలిచిపోయాయి. హాంకాంగ్ ఎయిర్‌లైన్స్ పలు విమాన సర్వీసులను రద్దు చేసింది. గ్రేటర్ బే ఎయిర్‌లైన్స్ కూడా పలు విమాన సర్వీసులను నిలిపివేసింది.

## కోహెడలో హోల్‌సేల్ చేపల మార్కెట్

రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మాణం
శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

**రంగారెడ్డి,జూలై10(జై భీమ్ న్యూస్):**

రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేసారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధు, రంగారెడ్డి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, ఫిషరీస్ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, అడిషనల్ కలెక్టర్ చంద్రా రెడ్డి, మత్స్యకారులు పాల్గొన్నారు. తెలంగాణ మత్స్య రంగ చరిత్రలో మరో చారిత్రక ఘట్టంగా నిలిచే కోహెడలో అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం శంకుస్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సముద్రతీర ప్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా అంతర్గత రాష్ట్రంలో ఇటువంటి ఆధునిక ఎగుమతుల కేంద్రం ఏర్పాటు కావడం తెలంగాణకు గర్వకారణం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, వారికి శాశ్వత ఉపాధి కల్పించడం, అంతర్జాతీయ మార్కెట్లకు అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో సుమారు రూ.47 కోట్ల వ్యయంతో ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ ప్రస్తుతం మంచినీటి చేపల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. 2025లో రాష్ట్రంలో సుమారు 4.20 లక్షల టన్నుల చేపలు, 15 వేల టన్నుల మంచినీటి రొయ్యల ఉత్పత్తి నమోదైంది. ఈ ఎగుమతుల కేంద్రం అందుబాటులోకి రావడంతో రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే చేపలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లు లభించి మత్స్యకారులకు మెరుగైన ధరలు అందనున్నాయి. తెలంగాణ చేపలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు దక్కనుంది. ఈ కేంద్రంలో ఆధునిక శీతల గిడ్డంగులు, శుద్ధి యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, శిక్షణా కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ వంటి అన్ని ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. సుమారు 2 వేల మంది వ్యాపారులు ఇక్కడ వ్యాపారం నిర్వహించే అవకాశం ఉండగా, లోడింగ్, అన్‌లోడింగ్, ప్యాకేజింగ్, రవాణా తదితర రంగాల్లో సుమారు 5 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు కేవలం చేపల మార్కెట్ మాత్రమే కాకుండా తెలంగాణ మత్స్య రంగాన్ని ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానం చేసే అభివృద్ధి వేదికగా నిలవనుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సహకరించిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, మత్స్యకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే ప్రతి చేపకు ప్రపంచ మార్కెట్ అందించడమే మా లక్ష్యం. మత్స్యకారుల కుటుంబాల్లో ఆర్థిక సంతోషం నింపడమే మా ప్రభుత్వ సంకల్పం.' అని ప్రభుత్వం పేర్కొంది.

## ఇరాన్‌పై అమెరికా మిస్సైల్ దాడులు

టెహ్రాన్,జూలై10(జై భీమ్ న్యూస్): అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జూన్‌లో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో ఉద్రిక్తతలు మళ్లీ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. గురువారం అమెరికా, ఇరాన్‌లు పరస్పరం దాడులు చేసుకున్నాయి. గురువారం తెల్లవారుజామున ఇరాన్‌లోని అణు విద్యుత్ కేంద్రం బుషెహర్ ప్లాంట్‌పై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది. దీంతో అణు ప్లాంట్ ఆవరణలోని ఓ భవనం దెబ్బతింది. అమెరికా మిస్సైల్ దాడి చేసిన వెంటనే ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు వెంటనే స్పందించి ఎదురుదాడి చేశాయి. పరస్పర దాడుల కారణంగా ఆ ప్రాంతం మొత్తం పేలుళ్ల శబ్దాలతో హోరెత్తింది. ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉన్న 'బుషెహర్' ప్రాంతంతో పాటు చోగడక్, బందర్ అబ్బాస్, వ్యూహాత్మక ఓడరేవు ఉన్న కొనారక్ ప్రావిన్స్‌లలో భారీ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం.

# కమలాపూర్ ప్రభుత్వ దవాఖాన ఎదుట తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన

**టీవీవీపీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్**

**హన్మకొండ జిల్లా/కమలాపూర్, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలోని ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీఎంఈయూ--ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శుక్రవారం కమలాపూర్ ప్రభుత్వ దవాఖాన ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రెండో దశ ఆందోళనలో భాగంగా ఈ నిరసన చేపట్టినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. రోగుల వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ పక్షాన పొట్టబత్తిని శ్రీనివాస్ మాట్లాడుతూ, టీవీవీపీ ఉద్యోగుల సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీవీపీకి రెగ్యులర్ కమిషనర్‌ను వెంటనే నియమించాలని, కమిషనర్ లేకపోవడం వల్ల పరిపాలనా నిర్ణయాలు ఆలస్యమవుతూ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 2026 సాధారణ బదిలీల్లో పలువురు ఉద్యోగులకు అన్యాయం జరిగిందని, డీఎంఈ పరిధిలోకి వెళ్లిన ఆసుపత్రుల సిబ్బందిని తిరిగి రీడిప్లాయ్ చేసి ఖాళీగా ఉన్న ఆసుపత్రుల్లో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌తో పాటు ఇతర పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. 2021--22లో టీవీవీపీ పరిధిలోకి తీసుకొచ్చిన సుమారు 70 ఆసుపత్రులకు ఇప్పటికీ అవసరమైన క్యాడర్ బలం మంజూరు చేయకపోవడంతో సిబ్బంది కొరత ఏర్పడి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఆసుపత్రులకు అవసరమైన పోస్టులను తక్షణమే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, మినిమమ్ టైమ్ స్కేల్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎంఎటీఎస్ ఉద్యోగులు పనిచేస్తున్న పోస్టులను బదిలీల్లో ఖాళీలుగా చూపకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించడం ద్వారా ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మెడికల్ సూపరింటెండెంట్ డా. చందు నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలంటే సిబ్బంది సమస్యలు, పరిపాలనా ఇబ్బందులను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో ప్రజలకు మరింత సమర్థవంతమైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్ఎంఓ డా. వరుణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల ఉద్యోగులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూనే ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నారని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వారికి భరోసా కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు ఎం. స్వప్న, డి. నేబ్లా, ఎస్. సుమన్, పరమేశ్వరి, కళ్యాణి, పద్మ, శానిటేషన్ సిబ్బంది ఎల్. సుధాకర్, రమ, జి. మానస, జ్యోతి, ఫార్మాసిస్ట్ సుష్మిత, డీఆర్‌ఏ దిలీప్, జూనియర్ అసిస్టెంట్లు కార్తీక్, కుమార్, శివతో పాటు ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




# మంగపేట-మల్లూరు-కాటాపురం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాల తగ్గింపే లక్ష్యం

**సమస్యాత్మక ఫీడర్లపై 14 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి: టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**

**ములుగు, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

ములుగు జిల్లాలోని మంగపేట, మల్లూరు, కాటాపురం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలను తగ్గించి వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంపై టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం ఏటూరునాగారం డివిజన్‌లో విస్తృతంగా పర్యటించిన ఆయన ఫీడర్ల పనితీరు, ట్రిప్పింగ్స్, అటవీ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల పరిస్థితి, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా ముందుగా 132/33 కేవీ కమలాపురం సబ్‌స్టేషన్‌ను సందర్శించిన సీఎండీ, అక్కడి నుంచి విద్యుత్ సరఫరా అవుతున్న 33 కేవీ మంగపేట, మల్లూరు ఫీడర్లలో తరచుగా జరుగుతున్న ట్రిప్పింగ్స్‌కు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు మూలకారణాలను గుర్తించి, శాశ్వత పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే కమలాపురం నుంచి 33/11 కేవీ మల్లూరు సబ్‌స్టేషన్ వరకు కొత్తగా నిర్మించిన ఇంటర్‌లింకింగ్ లైన్‌ను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. తర్వాత 33/11 కేవీ మంగపేట సబ్‌స్టేషన్‌ను సందర్శించిన సీఎండీ లాగ్‌బుక్‌ను పరిశీలించి, 11 కేవీ ఫీడర్లలో తరచూ చోటుచేసుకుంటున్న అంతరాయాలపై ఫీల్డ్ సిబ్బందితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పునరావృతమవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి 14 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, అందులో పేర్కొన్న పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని డీఈని ఆదేశించారు. అనంతరం 33/11 కేవీ మల్లూరు సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఆయన, అక్కడ కొనసాగుతున్న రియల్‌టైమ్ ఫీడర్ మానిటరింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని నిర్మాణ విభాగం అధికారులకు సూచించారు. 33 కేవీ కాటాపురం ఫీడర్‌తో పాటు 33/11 కేవీ కాటాపురం సబ్‌స్టేషన్‌ను కూడా పరిశీలించిన సీఎండీ, అటవీ ప్రాంతాలు మరియు చెట్లతో నిండిన ప్రాంతాల్లో తరచుగా విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో అవసరమైన చోట్ల కవర్డ్ కండక్టర్లు ఏర్పాటు చేయాలని ఏడీఈ తాడ్వాయికి ఆదేశించారు. లైన్ ట్రిప్పింగ్స్‌ను తగ్గించేందుకు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని, ఫీల్డ్ స్థాయిలో అధికారులు సమస్యాత్మక ఫీడర్లపై ప్రత్యేక దృష్టి సారించి వినియోగదారుల ఇబ్బందులను తగ్గించేలా వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఎస్ఈ ఆపరేషన్ ములుగు బిక్షపతి, డీఈ (టెక్నికల్) భాస్కర్, డీఈ (ఆపరేషన్) ఏటూరునాగారం జె. పురుషోత్తం, ఏడీఈ (ఆపరేషన్) బి. ఉమారావు, ఏఈ కమలాపురం, ఏఈ ఏటూరునాగారం, ఏడీఈ తాడ్వాయి, ఏఈ కమర్షియల్ ములుగు రాజేష్, మహేందర్ రెడ్డి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో జూలై 23న 'సే నో టు డ్రగ్స్' 2కే అవగాహన ర్యాలీ

**హన్మకొండ, 10 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

మాదక ద్రవ్యాల నిర్మూలనపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించేందుకు తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న సే నో టు డ్రగ్స్ నినాదంతో 2కే అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. సమాజ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని టీఎస్‌జేయూ చేపడుతున్న ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొంటూ, ర్యాలీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, యువతలో చైతన్యం తీసుకురావడమే ర్యాలీ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, జిల్లా కోశాధికారి సల్మాన్ ఖాన్, జిల్లా ప్రచార కార్యదర్శి అజీమ్ పాల్గొన్నారు. జూలై 23న నిర్వహించే 2కే ర్యాలీలో యువత, విద్యార్థులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.




# సమగ్ర ఓటర్ల జాబితా సవరణ డిజిటలైజేషన్ వేగవంతంగా పూర్తి చేయాలి

**బీఎల్ఓలకు పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హన్మకొండ జిల్లా/దామెర, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) ఆదేశించారు. శుక్రవారం దామెర మండలంలోని ఊరుకొండ గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలు మొబైల్ ఫోన్ ద్వారా ఓటర్ల వివరాల మ్యాపింగ్, డిజిటలైజేషన్, దరఖాస్తుల నమోదు వంటి ప్రక్రియలను ఎలా నిర్వహిస్తున్నారో స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి అర్హ ఓటరిని ఫోన్ ద్వారా సంప్రదించి అవసరమైన వివరాలు సేకరించి, దరఖాస్తులను సకాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సమగ్ర ఓటర్ల జాబితా సవరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని బీఎల్ఓలకు ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు తప్పకుండా నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, డిజిటలైజేషన్ ప్రక్రియలో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, గ్రామపంచాయతీ సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ డీఎంహెచ్‌వోగా డా. ఏ. అప్పయ్య బాధ్యతల స్వీకరణ



**హన్మకొండ, 10 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా డాక్టర్ ఏ. అప్పయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్ఎంఓగా విధులు నిర్వహించిన డా. అప్పయ్యను హనుమకొండ జిల్లా డీఎంహెచ్‌వోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం డా. అప్పయ్య జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కూడా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలని, ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మందులు, వైద్య సిబ్బంది సమన్వయంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేందుకు కృషి చేయాలని వారు కోరారు. అలాగే మాతా-శిశు ఆరోగ్యం, అంటువ్యాధుల నివారణ, టీకాల కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా డా. ఏ. అప్పయ్య మాట్లాడుతూ, జిల్లా ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన వైద్య సేవలు అందించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా సేవల నాణ్యతను మెరుగుపరుస్తామని, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు.

# కరూరు బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

**విజయ్ ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హైకోర్టు**

**చెన్నై,జూలై10(జై భీమ్ న్యూస్):**

విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో భారీ ఊరట లభించింది. కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు ఉద్యోగ పత్రాల పంపిణీకి కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ నియామక పక్రియను ముందుకు తీసుకెళ్లవచ్చని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగ నియామకాలు కేవలం 'తాత్కాలికం' మాత్రమేనని న్యాయస్థానం మెలిక పెట్టింది. భవిష్యత్తులో తుది తీర్పుకు లోబడి ఈ నియామకాలు ఉంటాయని స్పష్టం చేసింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్ శక్తివేల్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపింది. విచారణ సందర్భంగా ధర్మాసనం.. ప్రభుత్వం ఈ ఉద్యోగాలు ఇవ్వడానికి అనుసరించిన మార్గదర్శకాలు ఏమిటి?.. బాధితుల కుటుంబాలకు ఆ అర్హతలు ఉన్నాయా లేదా? అనే విషయాలపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎలాంటి స్పష్టమైన పాలసీ లేకుండా.. విపత్తు బాధితులకు ఉద్యోగాలు కేటాయించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 (సమానత్వ హక్కు) పరిధిలోకి వస్తుందో లేదో సమీక్షిస్తామని పేర్కొంది. కాగా, బాధితుల కుటుంబాలకు  శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం విజయ్ నియామక పత్రాలు అందజేయనున్నారు.

# 9, 10వ తరగతి బీసీ, ఈబీసీ విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ ఉపకార వేతన దరఖాస్తులు






**ఏడాదికి రూ.4 వేల ఉపకార వేతనం..**
**అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అధికారుల సూచన**

**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ మరియు ఇతర అర్హత కలిగిన పాఠశాలల్లో 9వ, 10వ తరగతులు చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు 2026--27 విద్యా సంవత్సరానికి ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి (ఎఫ్ఏసీ) సిద్ధం లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన డే-స్కాలర్ విద్యార్థులకు సంవత్సరానికి రూ.4 వేల ఉపకార వేతనం అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎన్ఎస్పీ ఓటీఆర్ యాప్ను డౌన్‌లోడ్ చేసుకుని, ఫేస్ ఆథెంటికేషన్ ద్వారా వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) నంబర్ పొందాలని సూచించారు. అనంతరం సమీప మీ సేవ కేంద్రంలో ఓటీఆర్ నంబర్‌తో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించి, ఈ-పాస్ పోర్టల్ ద్వారా కొత్త లేదా పునరుద్ధరణ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు నమోదు సమయంలో బయోమెట్రిక్ ధ్రువీకరణ తప్పనిసరిగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ పథకానికి 9వ, 10వ తరగతులు చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులు అర్హులని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ నకలు, స్టడీ సర్టిఫికేట్, హాజరు సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంత విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్ మరియు ఇతర అర్హత కలిగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఈ ఉపకార వేతన పథకంపై అవగాహన కల్పించి, దరఖాస్తు ప్రక్రియలో సహకరించాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి లక్ష్మణ్ కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో కలిసి సంబంధిత వసతి గృహ సంక్షేమ అధికారికి లేదా హనుమకొండలోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం లష్కర్ బజార్‌లోని బీసీ స్టడీ సర్కిల్ ప్రాంగణంలో ఉన్న జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

## కేయూలో రూ.70 లక్షలతో నూతన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణం



**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో తాగునీటి సరఫరాను మరింత మెరుగుపర్చేందుకు రూ.70 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను శుక్రవారం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పరిశీలించారు. యూనివర్సిటీ గ్రంథాలయం సమీపంలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి అధికారి ఆచార్య ఎన్. వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ, 43 సంవత్సరాల క్రితం నిర్మించిన 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల ప్రస్తుత ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌కు అదనంగా 2.50 లక్షల లీటర్ల సామర్థ్యంతో నూతన ట్యాంక్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు పేర్కొన్నారు. రూ.70 లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ఈ ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులు మరో ఐదు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరిశీలనలో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రంతో పాటు బిల్డింగ్ డివిజన్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## హన్మకొండలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆందోళన

**విద్యా రంగ సమస్యల పరిష్కారం కోరుతూ ర్యాలీ, రాస్తారోకో - నాయకుల అరెస్ట్**





**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం తక్షణమే విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హన్మకొండలో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చిన విద్యాసంస్థల బంద్ హన్మకొండ జిల్లాలో విజయవంతమైందని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించి బంద్ నిర్వహించగా, పలు ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా స్వచ్ఛందంగా బంద్ పాటించినట్లు నాయకులు పేర్కొన్నారు. అనంతరం కాకతీయ విశ్వవిద్యాలయం ఎస్‌డీఎల్‌సీఈ జంక్షన్ నుంచి వందలాది మంది విద్యార్థులతో బైక్ ర్యాలీ నిర్వహించి, భారీ ర్యాలీగా మర్కాజీ స్కూల్ సెంటర్ వరకు చేరుకున్నారు. అక్కడ ప్రధాన రహదారిపై సుమారు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనలో పాల్గొన్న పలువురు విద్యార్థి సంఘాల నాయకులను అదుపులోకి తీసుకుని హన్మకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా బాధ్యుడు భాష బోయిన సంతోష్, ఎస్ఎఫ్ఐ నాయకుడు మంద శ్రీకాంత్, పీడీఎస్యూతో పాటు ఇతర వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగం అనేక సమస్యలతో సతమతమవుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే చట్టాన్ని తీసుకురావాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించడం, ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యార్థి సంఘాలను ఏకం చేసి మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్, పీడీఎస్యూ నాయకులు వంగేటి మోహన్, వంశీ, కార్తీక్, ఏఐఎస్బీ నాయకులు మిస్బా, తాజుద్దీన్, సమీర్, ఏఐడీఎస్ఓ నాయకులు మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 30వ డివిజన్‌లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

**సీపీఎం డిమాండ్ - అధ్యయన యాత్రలో స్థానిక సమస్యల పరిశీలన**



**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అంబేద్కర్ నగర్‌లోని మల్లికాంబ మనోవికాస కేంద్రం నుంచి బస్టాండ్ కూడలి వరకు సీపీఎం ఆధ్వర్యంలో అధ్యయన యాత్ర నిర్వహించి, ప్రధానంగా డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం హనుమకొండ సౌత్ మండల కార్యదర్శి మంద సంపత్ మాట్లాడుతూ, హనుమకొండ బస్టాండ్ సమీపంలోని కబేళా ప్రాంతంలో ప్రతిరోజూ మటన్ వ్యాపారం జరుగుతుండటంతో అక్కడి నుంచి వచ్చే వ్యర్థాలు, పైభాగం నుంచి ప్రవహించే మురుగునీరు డ్రైనేజీలో పేరుకుపోయి కాలువ పూర్తిగా మూసుకుపోయిందన్నారు. దీంతో తీవ్ర దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు, క్రిమికీటకాలు పెరిగి స్థానిక ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చుట్టుపక్కల రహదారులు అభివృద్ధి చెందినప్పటికీ లోతైన డ్రైనేజీ కాలువను శుభ్రం చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై పలుమార్లు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ కాలువను వెంటనే శుభ్రపరచడంతో పాటు శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ అధ్యయన యాత్రలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు వెంకట్, హనుమకొండ సౌత్ మండల కమిటీ సభ్యుడు ఇస్లావత్ రవీందర్, పార్టీ నాయకులు కొమరయ్య, మంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం

**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**





కాకతీయ విశ్వవిద్యాలయం మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది కలిసి కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగిస్తూ పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. భిక్షాలు మాట్లాడుతూ, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అని అన్నారు. కళాశాల ఎల్లప్పుడూ పచ్చని వాతావరణంతో, పూల మొక్కలతో కళకళలాడేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పరిశుభ్రమైన మరియు హరిత వాతావరణం మనలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించి, ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాలను తరచూ నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతతో పాటు ప్రకృతి పట్ల ప్రేమాభిమానాలు పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో చురుకుగా పాల్గొన్నారు.

## జప్తు చేసిన ద్విచక్ర వాహనాలను సంబంధిత యజమానులు తీసుకెళ్లాలి

**కాజీపేట ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి**

**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ట్రాఫిక్ ఉల్లంఘనలు, తనిఖీలు మరియు ఇతర కారణాలతో జప్తు చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచిన ద్విచక్ర వాహనాలను సంబంధిత యజమానులు తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కాజీపేట ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్సీ), ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర అవసరమైన పత్రాలతో కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి, నిబంధనల ప్రకారం వాహనాలను తీసుకెళ్లవచ్చని తెలిపారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, పెండింగ్ ఈ-చలాన్లు లేదా ఇతర ట్రాఫిక్ కేసులు ఉన్నట్లయితే, వాటిని త్వరితగతిన పరిష్కరించుకుని అనంతరం వాహనాలను స్వాధీనం చేసుకోవాలని సూచించారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పోలీస్ స్టేషన్‌లో ఉన్న తమ వాహనాలను ఆలస్యం చేయకుండా తీసుకెళ్లాలని కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పిట్టల వెంకన్న కోరారు.



# మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయాలి: కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

మై భారత్ పోర్టల్‌లో హనుమకొండ జిల్లాకు నిర్దేశించిన యువత నమోదు లక్ష్యాన్ని అన్ని శాఖల సమన్వయంతో గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మై భారత్ జిల్లా సలహా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో మై భారత్ జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 7,226 మంది యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ఆగస్టు 15, 2026 నాటికి మరో 8,554 మంది యువతను నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం జూలై 1 నుంచి ఆగస్టు 15 వరకు ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న యువతకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జాతీయ స్థాయి కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, నాయకత్వ వికాస శిక్షణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, యువజన మార్పిడి కార్యక్రమాలు తదితర అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్



పాయి మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు, జిల్లా సలహా కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేసి అధిక సంఖ్యలో యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. హనుమకొండ జిల్లాకు చెందిన యువత జాతీయ స్థాయి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడంతో పాటు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. మై భారత్ కార్యక్రమం యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సేవాభావాన్ని పెంపొందించే ఉత్తమ వేదిక అని పేర్కొన్న కలెక్టర్, నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత డా. అకులపల్లి మధు, పింగళి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి, రెడ్‌క్రాస్ చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ.వి. శ్రీనివాసరావు, ఎస్.ఏ. నయీమ్, ఎ. రాజ్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రామ్ అధికారి, వికాస్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు వెల్దొండ సురేష్, మై భారత్ ఎం.టి.ఎస్. సి. సృజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హిందీ ప్రభుత్వ టీచర్ల శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించిన డీఈవో గిరిరాజ్ గౌడ్





**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లా విద్యాధికారి (డీఈవో) బి. గిరిరాజ్ గౌడ్ శుక్రవారం హనుమకొండ డైట్ కళాశాలలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వ హిందీ భాషా ఉపాధ్యాయుల సమీకృత శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొంటున్న హిందీ భాషా ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యక్షంగా ముచ్చటించారు. శిక్షణలో బోధిస్తున్న అంశాలు, వాటి ప్రాముఖ్యత, తరగతి గదిలో వాటిని అమలు చేసే విధానాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గతంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలతో పోల్చితే ప్రస్తుత శిక్షణలో చోటుచేసుకున్న మార్పులు, బోధనా విధానాలపై ఉపాధ్యాయుల అభిప్రాయాలు, అనుభవాలను కూడా తెలుసుకుని పలు సూచనలు చేశారు. మహిళా ఉపాధ్యాయులు సహా పలువురితో ప్రత్యేకంగా మాట్లాడిన డీఈవో, శిక్షణలో తలెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల అభ్యసన ఫలితాలను మరింత మెరుగుపరిచేలా ఆధునిక, వినూత్న బోధనా పద్ధతులను తరగతి గదిలో అమలు చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలు, బోధనా విధానాలను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా వినియోగించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా హిందీ రిసోర్స్ పర్సన్లు ఎఫ్.ఎస్. అలీ, ఎస్.కె. గౌస్ పాషా, ఎం.డి. అజీముద్దీన్, పి. శ్రీనివాస్ పాల్గొని శిక్షణను నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## శ్రీనిధి కార్యక్రమం పురోగతిపై సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా. సత్య శారద






**వరంగల్, 10 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

శ్రీనిధి కార్యక్రమం అమలు, రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు సంబంధించిన అంశాలపై జిల్లా పరిషత్ సమావేశం హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన స్వయం సహాయక సంఘాల సభ్యులకు శ్రీనిధి ద్వారా అందించే రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శ్రీనిధి లక్ష్యాల సాధన, రుణాల మంజూరు, తిరిగి చెల్లింపుల పురోగతి, సంఘాల బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,శ్రీనిధి జోనల్ ఆఫీసర్ ఎస్.ఎన్., ఆర్.ఎం. సైదిరెడ్డి, జెడ్ఎస్ఎస్ అధ్యక్షురాలు రజిత, ట్రెజరర్, జాయింట్ సెక్రటరీ, ఏపీఎంలు, డీపీఎంలు, ఐబీ ప్రతినిధులు, మెప్మా డీఎంసీ, సీఓఎస్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భద్రకాళి మాడ వీధుల బాధిత కుటుంబాలకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ

**బాధిత కుటుంబాల జీవనోపాధి మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

భద్రకాళి మాడ వీధుల అభివృద్ధి పనుల నేపథ్యంలో ప్రభావితమైన కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించే చర్యల్లో భాగంగా అర్హులైన 30 మంది లబ్ధిదారులకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ నియామక పత్రాలను శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంయుక్తంగా లబ్ధిదారులకు నియామక పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో భాగంగా ప్రభావితమైన కుటుంబాల సంక్షేమం విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తోందన్నారు. అలాంటి కుటుంబాల జీవనోపాధి దెబ్బతినకుండా వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థిక భరోసా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన బాధితులకు ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, గృహ, ఉపాధి పథకాల ప్రయోజనాలు కూడా అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ కార్యక్రమాలు పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీలో చేరిన అడ్వకేట్ రవి వర్మ

**పవన్ కళ్యాణ్ సమక్షంలో కండువా కప్పి ఆహ్వానం**







**శేరిలింగంపల్లి, జూలై 10 (జై భీమ్ న్యూస్)**


శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ వెర్టెక్స్ ప్రైమ్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది అడ్వకేట్ రవి వర్మ శుక్రవారం జనసేన పార్టీలో అధికారికంగా చేరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరగా, పవన్ కళ్యాణ్ స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ రవి వర్మ మాట్లాడుతూ, ప్రజాసేవ, పారదర్శక పాలన, రాజ్యాంగ విలువల పరిరక్షణ, యువత సాధికారత వంటి అంశాల్లో జనసేన పార్టీ అనుసరిస్తున్న సిద్ధాంతాలు తనను ఆకర్షించాయని తెలిపారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక అభివృద్ధి లక్ష్యంగా పార్టీ వేదికగా చురుకైన పాత్ర పోషిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసేన పార్టీ ఇంచార్జ్ శంకర్ గౌడ్, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రామ్ తాళ్లూరి, చేరికల కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, డా. గడల శ్రీనివాస్, ప్రజీత్ గౌడ్, తనీష్, సీనియర్ నాయకులు రాజ లింగం, రామకృష్ణ, సాగర్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అడ్వకేట్ రవి వర్మకు ఘన స్వాగతం పలికి, ఆయన చేరికతో తెలంగాణలో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ప్రజా ఉద్యమాల్లో ఆయన సేవలు పార్టీకి ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సమగ్ర శిక్ష, పీఎం పోషణ్ అమలుపై కలెక్టర్ సమీక్ష

**ప్రగతి పోర్టల్‌లో వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశం**

**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో అమలవుతున్న సమగ్ర శిక్ష మరియు పీఎం పోషణ్ కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి ప్రగతి పోర్టల్‌లో నమోదు చేయాల్సిన వివరాలు, ఆర్థిక పురోగతి, కార్యక్రమాల అమలుపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు మహేష్, డాక్టర్ మన్మోహన్, సునీత, సుమ, రఘు చంద్రరావు, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా ప్రగతి పోర్టల్‌లో నమోదు చేయాల్సిన ఆర్థిక వివరాలు, కార్యక్రమాల అమలు స్థితి, నిధుల వినియోగం, లక్ష్యాల సాధన తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వివిధ కార్యక్రమాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, అడ్డంకులను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. రాబోయే రోజుల్లో కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, అన్ని వివరాలను ఎప్పటికప్పుడు ప్రగతి పోర్టల్‌లో నమోదు చేసి నవీకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు



ప్రగతి(ప్రో - ఆక్టివ్ గవర్నన్స్ అండ్ టైంలీ ఇంప్లీమెంటేషన్) వేదిక ప్రాధాన్యాన్ని వివరించారు. 2015 మార్చి 25న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ డిజిటల్ గవర్నెన్స్ వేదిక ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంపొందించడం, ప్రజా ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం, కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అమలును పర్యవేక్షించడం, ప్రభుత్వ పథకాల పురోగతిని నిరంతరం సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. అలాగే సమాచార సాంకేతికత (ఐసీటి), డిజిటల్ డేటా మేనేజ్‌మెంట్, జియో-స్పేషియల్ టెక్నాలజీ, రియల్‌టైమ్ ప్రెజెంటేషన్, వీడియో కాన్ఫరెన్సింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రగతి వేదిక ద్వారా అభివృద్ధి కార్యక్రమాల అమలును వేగవంతం చేయడంతో పాటు జాప్యాలను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడుతోందని సమావేశంలో వెల్లడించారు. జిల్లాలో సమగ్ర శిక్ష, పీఎం పోషణ్ కార్యక్రమాల అమలులో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# కాంగ్రెస్ ప్రచారాసభగా రైతు ఆశీర్వాద సభ

**రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యం**
**తెలంగాణలో 20 ఎంపి సీట్లు గెలిపిస్తే రాహుల్ ప్రధాని**
**వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌దే గెలుపు**
**కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా తొక్కివేస్తా**
**బావామర్దులు కలసి ఊరుమీద పడి తిరుగుతున్నారు**
**కెసిఆర్‌ను ఫామ్‌హౌజ్‌కే పరిమితం చేసేశాం**
**మధిర రైతు ఆశీర్వాద సభలో భరోసా నిధులు విడుదల**
**సభలో సిఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**



**ఖమ్మం,జూలై10(జై భీమ్ న్యూస్):**

ఖమ్మం జిల్లాలో జరిగిన రైతు ఆశీర్వాద సభ కాస్తా..ఎన్నికల ప్రచార సభగా మారింది. రాహుల్‌ను ప్రధానిని చయేయడమే తమ లక్ష్యమని సిఎం రేంవత్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 20 పార్లమెంట్ సీట్లు గెలిపించాలని, దీంతో రాహుల్‌ను ప్రధానిని చేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారమని కూడా రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని చెప్పారు. అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కి.. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి పెరుగుతాయని చెప్పారు. 2029 మే-జూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 182 స్థానాల్లో 117 సీట్లకు పైగా గెలుస్తామని.. ఇది భద్రాచలం రాముడిపై ఆన అని రేవంత్ వ్యాఖ్యానించారు. రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురం లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, భాజపాపై విమర్శలు చేశారు. ఇక్కడి ప్రజలను చూస్తే నా గుండె పులకిస్తోంది. రాజకీయంగా నాకు పాలమూరు ప్రాణం. నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పనిచేసింది. నేడు వరి కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నాం. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారు. నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారు. ఉచిత కరెంట్.. కాంగ్రెస్ పేటెంట్ రైట్. మా ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ. 1.70లక్షల కోట్లు ఖర్చు చేశాం అని రేవంత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విశ్రమించరని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని కొందరు చెప్పారు. వాళ్లని ఎలా ఎదుర్కోగలరని ప్రశ్నించారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తోందని ఆనాడే చెప్పా. ఎన్నికల్లో మాకు 64 సీట్లు వచ్చాయి. ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచాం. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లోనూ గుండు సున్నా తప్పదని చేవెళ్ల సభలో చెప్పా. అన్ని ఎన్నికల్లోనూ నేను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కి పరిమితం చేశాం. కౌరవ వంశాన్ని తెలంగాణ గడ్డ నుంచి తొలగిస్తాం. కాసుకో కేసీఆర్.. నిన్ను, నీ బంధువులను, సర్వేలను ఓడిస్తాం. మిమ్మల్ని ఓడించేందుకు రోజూ 18 గంటలు పనిచేస్తాం. మోదీ, అమిత్‌షా ఇతర పార్టీలను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌లను చీల్చారు. ఇతర పార్టీలను కూడా లొంగదీసుకుని లోక్‌సభ సీట్ల పెంపు బిల్లును ఎలా అయినా ఆమోదింపజేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ విషయంలో వారు విజయం సాధించడానికి అవకాశం ఉందని రేవంత్ అన్నారు. ఇకపోతే రైతు భరోసా తుది విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఖమ్మంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి.. అన్నదాతల నిధులు విడుదల చేసేందుకు బటన్ నొక్కారు. అనంతరం భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణలో పదేళ్లపాటు బీఆర్ఎస్ రాక్షస పాలన సాగిందని సీఎం రేవంత్ అన్నారు. వారి పాలనలో రైతులకు బేడీలు వేశారని మండిపడ్డారు. దీంతో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అనేది లేకుండా ప్రజలు చేశారని ఆయన చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో 2023లో ఓ అద్భుతం జరిగింది. బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌లోకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చారు. దీంతో ఆనాడు కాంగ్రెస్‌లోకి ఉప్పెనలా జనం వచ్చారు. కారు పార్టీని ప్రజలు ఇక్కడ మళ్లీ మొలకెత్తనీయకుండా చేశారు. 2023 ప్రభుత్వ ఏర్పాటు నుంచి ఏ ఎన్నికలైనా కాంగ్రెస్‌దే గెలుపు అంటూ ధీమా వ్యక్తం చేశారు. అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. ప్రతి సందర్భంలోనూ వారిని ఆదుకుంటూ వస్తున్నాం. రైతు కళ్లల్లో ఆనందమే మాకు ఆశీర్వాదం. కల్వకుంట్ల కుటుంబంలో ఒకరంటే ఒకరికి నమ్మకం లేదు. కుళ్లు, కుతంత్రాలు, కుట్రలతో బయటకు వస్తున్నారు. అధికారం పోయిందనే అక్కసుతోనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. బావా బామ్మర్దులిద్దరూ ఊళ్లపై పడి తెగ తిరుగుతున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని విషప్రచారం చేశారు. ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకోండి.. సలసల మాడిపోతారు. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో సినిమా కథలు చెప్పారు. ఇప్పుడు పొంగులేటి 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. కన్నెపల్లి పంప్‌లు ఆన్ చేస్తే భద్రాచల రాముడి ఆలయం సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. బీజేపీతో హరీశ్ రావు మంతనాలు జరుపుతున్నారో, లేదో భద్రాచల రాముడిపై ఒట్టేసి చెప్పాలి. కారు పార్టీలో ఉంటావో లేదో కేసీఆర్‌పై ఒట్టేసి హరీశ్ రావు చెప్పాలి. తాటిచెట్టంత పెరిగినా ఆయనకు బుర్రలో గుజ్జు లేదు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని కేటీఆర్ చెల్లెలే చెబుతున్నారని తెలిపారు.

## హసన్‌పర్తిలో నిషేధిత గుట్కా స్వాధీనం.. కిరాణా వ్యాపారి అరెస్ట్

**రూ.1,226 విలువైన విమల్, పాన్‌బహార్ పొగాకు ఉత్పత్తులు సీజ్**
**అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు: ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్**




**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని యెల్లాపూర్ గ్రామంలో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను అక్రమంగా విక్రయిస్తున్న ఓ కిరాణా వ్యాపారిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ. 1,226 విలువైన నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, యెల్లాపూర్ గ్రామానికి చెందిన చామంతుల రాజు (46) తన శివ సాయి కిరాణా షాప్లో వరంగల్ నుంచి అక్రమంగా తెచ్చిన విమల్, పాన్‌బహార్ గుట్కా మరియు ఇతర నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో హసన్‌పర్తి పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ బి. లక్ష్మణ్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం దుకాణంలో తనిఖీలు నిర్వహించగా, రూ. 1,226 విలువైన నిషేధిత గుట్కా, పొగాకు ప్యాకెట్లు లభించాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి హానికరమైన గుట్కా, ఇతర నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. అక్రమంగా ఇటువంటి ఉత్పత్తులను నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అర్హుల పేర్లు పోకుండా జాగ్రత్త పడాలి



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా జరిగే బిఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా, ఎలాంటి పొరపాట్లు లేకుండా నింపించి, నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బరిగల కుమారస్వామి,బరిగల ఏలియా, బొల్లెపెల్లి సంపత్,మహమ్మద్ రహీమ్ పాషా,జన్ను కుమారస్వామి,కట్కూరి రాజేందర్, ఆడెపు సుజాత ల తో పాటు బిఎల్వో వేణు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోగా సర్ పక్రియ పూర్తి చేయాలి

**ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ**


**హైదరాబాద్,జూలై10(జై భీమ్ న్యూస్):**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ పక్రియపై పవన్ కుమార్ శర్మ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు(డిఇఓలు), ఓటరు జాబితా పరిశీలకులు పాల్గొన్నారు. సందర్భంగా పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ పక్రియలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో డిజిటలైజేషన్ పక్రియను మరింత వేగవంతం చేయాలని ప్రత్యేకంగా ఆదేశించారు. సర్ పక్రియలో అత్యుత్తమ పనితీరును కనబరిచిన జిల్లాల ఎన్నికల అధికారులతో కమిషన్ మాట్లాడి, వారు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకుంది. ఆ వ్యూహాలను ఇతర జిల్లాలు కూడా అమలు చేసి, ఎన్యూమరేషన్ పక్రియను పూర్తి చేసి చేయాలని ఆదేశించారు. దనంగా, రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ పక్రియలను ప్రతిరోజూ నిర్దేశరచిన లక్ష్యాల ప్రకారం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారికి భారత ఎన్నికల కమిషన్ ఆదేశించింది.

## 'క్లీన్ అండ్ గ్రీన్'తో హరిత శోభ సంతరించుకున్న కాకతీయ విశ్వవిద్యాలయం

**విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుదాం: ఈసీ సభ్యుడు డా. చిర్ర రాజు గౌడ్**







**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం అవెన్యూ ప్లాంటేషన్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం మానవీయ శాస్త్ర భవనం ప్రాంగణంలో "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. సెల్ ఇన్‌చార్జి డా. బి. వెంకట గోపీనాథ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని ప్రాంగణాన్ని పరిశుభ్రం చేయడంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పాలక మండలి (ఈసీ) సభ్యుడు డా. చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ, పరిశుభ్రమైన, హరితమయమైన విశ్వవిద్యాలయ ప్రాంగణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. పరిశుభ్రతను అలవాటుగా మార్చుకోవడంతో పాటు మొక్కలను సంరక్షించడం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మానవీయ శాస్త్ర భవనం ప్రిన్సిపాల్ ఆచార్య మనోహర్ మాట్లాడుతూ, పరిశుభ్రత ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యత అని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంచుతాయని తెలిపారు. విశ్వవిద్యాలయాన్ని హరితవనంగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డా. లింగయ్య, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డా. అకుతోట శ్రీనివాస్, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డా. గడ్డం కృష్ణ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మొరం రవాణాపై హసన్‌పర్తి పోలీసుల ఉక్కుపాదం

**మూడు టిప్పర్లు సీజ్.. ముగ్గురు డ్రైవర్లు అదుపులో**
**అక్రమ రవాణాపై కఠిన చర్యలు తప్పవు: ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్**




**హన్మకొండ, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ (మొరం) రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను హసన్‌పర్తి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, హసన్‌పర్తి మండలంలోని నల్లగట్టు వై జంక్షన్ వద్ద హెడ్ కానిస్టేబుల్ ఆర్. శంకరయ్య సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఎల్కతుర్తి నుంచి హనుమకొండ వైపు ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ (మొరం)ను తరలిస్తున్న మూడు టిప్పర్లు గుర్తించారు. వెంటనే వాహనాలను నిలిపివేసి తనిఖీ చేయగా, అవసరమైన అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ పి. గోవర్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వాహనాల డ్రైవర్లు పి. రాజు, పి. శ్రీనివాస్, కె. కార్తీక్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఖనిజ సంపదను అక్రమంగా తవ్వడం, రవాణా చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖనిజ, సంపద అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ప్రజలు కూడా ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజనింగ్

నాగర్‌కర్నూలు,జూలై10(జై భీమ్ న్యూస్): అమ్రాబాద్ మండలం, మన్ననూర్ గ్రామంలోని ప్రాజెక్టు గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో 26,27 మంది విద్యార్థులు అల్పాహారం తీసుకున్న అనంతరం అస్వస్థతకు గురైన ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణ చేపట్టింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాధిత విద్యార్థుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, విచారణ నివేదిక, ఆహారం మరియు తాగునీటి నమూనాల పరీక్ష ఫలితాలు, బాధ్యులపై తీసుకున్న చర్యలు, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టిన నివారణ చర్యలపై సమగ్ర నివేదికను సమర్పించాలని నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్‌ను కమిషన్ ఆదేశించింది.

# బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్

### రూ.1.34 లక్షలు

**ఢిల్లీ : జులై 10 2026(జై భీమ్ న్యూస్)**

లైట్ ఫోన్ను 5. 1,34,1665 (అన్ని పన్నులతో కలిపి) అందుబాటులోకి తెస్తు న్నట్లు ప్రభుత్వరంగ బీఎస్ ఎన్ఎల్ ప్రకటించింది. రక్షణ, నావికా రంగాలతో పాటు ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయాల్లో ప్రజలకు శాటి లైట్ కమ్యూనికేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఈ ఫోన్ ఉపయోగ పడు తుంది. సంప్రదాయ మొబైల్ నెట్వర్క్ అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో కూడా వాయిస్ కాల్స్, సంక్షిప్త సందేశాలు (ఎస్ఎంఎస్) ఈ గ్లోబల్ శాటిలైట్ ఫోన్ సర్వీస్ (జీఎస్పీఎస్) ద్వారా పొందొచ్చని వివరించింది. సుదూర ప్రాంతాల్లో ఉండే గనులు, అడ్వెంచర్ ట్రావె లింగ్కు వెళ్లేవారికీ ఈ ఫోన్ ఉపయోగ పడుతుందని పేర్కొంది. ఈ ఫోను సంబందించిన వివరాల కోసం సమీప బీఎస్ ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని సామాజిక మాధ్యమ పోస్టులో సంస్థ సూచించింది. వివరాలు కావాల్సిన వారు సంప్రదించాలంటూ, ఒక మొబైల్ నంబరును సంస్థ సూచించినా, దానికి కాల్ చేస్తే స్పందించడం లేదని వార్తా సంస్థ పీటీఐ తెలిపింది. ఈ సేవలు పొందేందుకు.. శాటిలైట్ ఫోన్ వినియోగించాలను కునే వారు కొన్ని షరతులు పాటిం చాల్సి ఉంటుంది. ఎక్కడ ఎంత కాలం ఎందుకు వినియోగించను న్నారు అనేది బీఎస్ఎన్ఎల్కు తెల పాల్సి ఉంటుంది. పోస్ట్పెయిడ్ కనెక్షన్ కింద ప్రభుత్వ, వాణిజ్య సంస్థలకు ఈ ఫోను నెలకు . 3,500, 5.5,835, . 11,670 కేటాయిస్తారు. ఈ పథకాల కింద వరుసగా 16, 30, 60 నిమిషాల ఉచిత టాక్టైమ్ లేదా ఎస్ఎం ఎస్లు లభిస్తాయి.




**ప్రీపెయిడ్ కనెక్షన్ కింద నెలకు**

రూ. 3,500 (20 నిమిషాల ఉచిత టాక్టైమ్తో), ఏడాదికి రూ. 38,500 (240 నిమిషాల ఉచిత టాక్టైమ్తో) ప్రభుత్వ సంస్థలకు అందిస్తా మంది. వాణిజ్య సంస్థలకు అయితే నెలకు రూ. 5,835 (30 నిమిషాల ఉచిత టాక్టైమ్), ఏడాదికి రూ. 64,185 (360 నిమిషాల ఉచిత టాక్ టైమ్తో) లభిస్తుంది. ఉచిత నిమిషాలు పూర్తయ్యాక.. ప్రభుత్వ సంస్థలకు అయితే నిమిషం కాల్ లేదా ఎస్ఎం ఎస్కు రూ. 18 చొప్పున, వాణిజ్య సంస్థలకు అయితే రూ. 25 చొప్పున చార్జి చేస్తారు. తదుపరి .200, 5.500. 1,000, 5.5000, రూ. 10,000తో రీఛార్జి చేసుకోవచ్చు.

# కూటమిలో విద్యావ్యవస్థ అధ్వాన్నం

### ప్రచార ఆర్భాటాలు, రంగుల ప్రకటనలపైనే శ్రద్ధ
### నేటికీ విద్యామిత్ర కిట్లు, బూట్లు, బెల్టులు, బ్యాగులు అందలేదు
### లకేశ్ ఆర్భాట ప్రకటనలు తప్ప మరేమీ లేదు
### మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శ

**అమరావతి,జూలై10(జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించిందని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. కేవలం ప్రచార ఆర్భాటాలు, రంగుల ప్రకటనలపై ఉన్న శ్రద్ధ.. పేద పిల్లల చదువులు, వారి ప్రాథమిక వసతులపై లేకపోవడం ప్రభుత్వ ఉదాసీనతకు అద్దం పడుతోందని ఆక్షేపించారు. తాడేపల్లి వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. నాడు వైఎస్ జగన్ హయాంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, కార్పొరేట్ సంస్థలు అసూయపడేలా వెలిగిపోయిన ప్రభుత్వ పాఠశాలలను.. నేడు చంద్రబాబు, లోకేష్లు కలిసి మళ్లీ 2014-19 నాటి చీకటి రోజుల్లోకి, అధ్వాన్న స్థితికి దిగజార్చారని సురేష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కనీసం పిల్లలకు సురక్షిత మంచినీరు, నాణ్యమైన భోజనం కూడా ఇవ్వలేని దుస్థితికి దిగజారిందని... ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాఠశాలలు తెరిచి నెల రోజులు కావస్తున్నా విద్యార్థులకు కనీస అవసరాలైన విద్యామిత్ర కిట్లు, బూట్లు, బెల్టులు, బ్యాగులు అందలేదు. జిల్లాలకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు కూడా అరకొరగానే చేరాయ,గతంలో మిగిలిపోయిన పాత స్టాక్తో అడ్జస్ట్ చేసే దౌర్భాగ్య స్థితికి ప్రభుత్వాన్ని తీసుకొచ్చారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ నేతృత్వంలో బడులు తెరిచే ఆరు నెలల ముందే భారీ కసరత్తు చేసి, పాఠశాల ప్రారంభమైన మొదటి వారంలోనే విద్యార్థుల చేతికి పుస్తకాలు, యూనిఫాం, షూ, బ్యాగులు అందించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి కేవలం ప్రచారాలకే పరిమితమైంది. బడ్జెట్లో అత్యధిక నిధులను ప్రచారానికే కేటాయించి, విద్యావ్యవస్థకు అన్ని హంగులు అద్దినట్లుగా రంగుల ప్రపంచాన్ని చూపిస్తూ తల్లిదండ్రులను, పిల్లలను మభ్యపెడుతున్నారు. మహిళల భద్రత గురించి మాట్లాడే కూటమి ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే బాలికలకు కనీసం టాయిలెట్లు కూడా కల్పించడంలో విఫలమైందన్నారు. 2019లో వైఎస్. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారు. జూన్ 2019 నుండి ఫిబ్రవరి 2024 వరకు విద్యాశాఖపై రూ. 72,919 కోట్లు ఖర్చు చేశారు. 'నాడు-నేడు' ద్వారా రెండు దశల్లో 44,617 స్కూళ్లను సుమారు రూ. 11,000 కోట్లతో అత్యాధునికంగా తీర్చిదిద్దారు. పెయింటింగ్స్, ఫర్నీచర్, డిజిటల్ క్లాస్ రూములు, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్స్ వంటి 11 రకాల మౌలిక వసతులను తప్పనిసరి చేశారు. 'అమ్మఒడి' పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 25,809 కోట్లు జమ చేశారు. ఇంగ్లిష్ మీడియం, 8వ తరగతి పిల్లలకు ట్యాబ్ల పంపిణీ, బైలింగువల్ టెక్స్ట్ బుక్స్, ఇంటరాక్టివ్ ఎ÷-లాట్ ప్యానెల్స్ ద్వారా ఏపీ విద్యార్థులు ఐక్యరాజ్యసమితిలో ఇంగ్లిషులో ప్రసంగించే స్థాయికి ఎదిగారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్లు పెడుతున్న పేరెంట్ టీచర్ మీటింగ్స్ (పీటీఎం) సభల్లో కనిపిస్తున్న ఫర్నీచర్, టేబుల్స్ అన్నీ వైఎస్ జగన్ ప్రభుత్వ హాయంలో సమకూర్చినవేనన్నారు. వైఎస్ జగన్ గారి హయాంలో రోజుకో మెనూతో, పౌష్టికాహారంతో రూ. 7,244 కోట్లు ఖర్చు చేసి 'జగనన్న గోరుముద్ద' అందిస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో అది పిల్లల ప్రాణాలకే ముప్పుగా మారింది. పాఠశాలల్లో నీళ్ల సాంబారు, ముద్దన్నం పెడుతున్నారు. కలుషిత నీరు తాగి విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు కూడా చూస్తున్నాం. గతంలో 43 లక్షలుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, ప్రస్తుతం 30 లక్షలకు పడిపోయిందని.. డ్రాపౌట్ రేట్ ఇంత దారుణంగా పెరగడానికి ప్రభుత్వ అసమర్థతే కారణం అన్నారు. స్టాన్ఫర్డ్లో చదువుకున్నానని చెప్పుకునే విద్యాశాఖ మంత్రి లోకేష్ రోజుకో దేశం తిరుగుతూ క్వాంటమ్ వ్యాలీ, ఏఐ టెక్నాలజీ అని మాట్లాడుతున్నారు, మరి ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాసురూములు, ట్యాబులు, నాడు-నేడు పనులను ఎందుకు ఆపేశారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అబ్బకూడదనేదే లోకేష్ ఉద్దేశమా? గతంలో లోకేష్ ఆర్భాటంగా ప్రకటించిన రూ. 7వేల కోట్ల 'మన బడి - మన భవిష్యత్తు' నిధులు ఏమయ్యాయని అన్నారు. ఈ కూటమి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ప్రచార ఆర్భాటాలు పక్కనబెట్టి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు చేపట్టాలన్నారు.

# పోర్టులు, భూములను కట్టబెట్టేందుకే కేబినేట్

### ఐదుగురు మంత్రులు డుమ్మా కొట్టినా పట్టింపు ఏదీ
### మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపాటు

**అమరావతి,జూలై10(జై భీమ్ న్యూస్):**

పోర్టులు, భూములను తమ వారికి కట్టబెట్టటానికే చంద్రబాబు కేబినెట్ సమావేశమంటూ వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఐదుగురు మంత్రులు గైర్హాజరయ్యారంటే ఎంత నాన్ సీరియస్గా జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. కేబినెట్ సమావేశంలో ప్రజలకు మేలు చేసే అంశాలపై చర్చించటం మానేశారంటూ ఆయన దుయ్యబట్టారు. కేబినెట్కి డీజీపీ వెళ్లి సోషల్ మీడియా కట్టడిపై మాట్లాడటం ఏంటన్నారు. టీడీపీ పెయిడ్ ఆర్టిస్టులతో మా పార్టీ నేతలను తిట్టిస్తున్నారు. జుగుప్సాకరంగా పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేదు. కానీ మావారిపై అక్రమ కేసులు పెట్టి 1,394 మందిని అరెస్టు చేశారు. సోషల్ మీడియా అంటే చంద్రబాబు భయపడిపోతున్నారు. అందుకే టాస్క్ ఫోర్స్ కూడా పెడుతున్నారు. గాదె సాయికృష్ణను దారుణంగా లాకప్ డెత్ చేస్తే ఈ డీజీపీ ఎందుకు మాట్లాడలేదని అంటూ అంబటి ప్రశ్నించారు. క్రాంతికుమార్ ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు సైలెంట్గా ఉన్నారని అన్నారు. ఇలాంటి వాటిపై కేబినెట్లో చర్చించరా?. ఉండవల్లిలో పోలీసు కానిస్టేబుల్ తల పగలకొట్టిన టీడీపీ కార్యకర్తలపై ఎందుకు కేసు పెట్టలేదు?. ఉత్తుత్తి కేబినెట్లు కాకుండా ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలి. పవన్ కళ్యాణ్ కేబినెట్కి ఎందుకు రావటం లేదు?. ఆ కారణాలు ఏంటో సీఎం, డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలని అంబటి నిలదీశారు. రావణ్కు అన్ని కేసుల్లోనూ బెయిల్ వస్తోందని ఉపా చట్టం ప్రయోగించారు. రావణ్ టీమ్లోని ఒక మహిళ జగన్ని కలిసి న్యాయ సహాయం కావాలని కోరారు. వైఎస్ జగన్ సరే అన్నారు.. అంతే తప్ప రావణ్కు మాకు ఎలాంటి సంబంధం లేదు. టీడీపీ కార్యకర్తలు అడిగినా న్యాయ సహాయం చేస్తాం. తీవ్ర వాదుల మీద పెట్టాల్సిన చట్టాన్ని అమాయకులపై పెట్టటం ఏంటి?. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం అంటే ఇదే అంటూ అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు.

# సోషల్ మీడియా దుష్ప్రచారాలపై ఆందోళన

### ఏపీ కేబినెట్లో సీరియస్గా చర్చ
### పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన డిజిపి
### టాస్క్ఫోర్స్ ఏర్పాటుకు సిఎం ఆదేశం

**అమరావతి,జూలై10(జై భీమ్ న్యూస్):**

సోషల్ మీడియా అంశంపై ఏపీ కేబినెట్లో సీరియస్గా చర్చ జరిగింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షత కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోషల్ మీడియాపై డీజీపీ, ఇతర పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా, నేతలను కించపరుస్తూ వస్తున్న వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవిస్తూనే అభ్యంతరకర వ్యాఖ్యలను ఏ మాత్రం ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు కేబినెట్ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం వెంటనే టాస్క్ ఫోర్స్ను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను మంత్రిమండలి ఆదేశించింది. అవసరమైతే బయటనుంచి సిబ్బందిని తీసుకోవాలని సూచించింది. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా కొత్తగా పీపీలను నియించు కోవాలని ఏపీ కేబినెట్ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వంపై అభూత కల్పనలు, అసత్యాలు, అసలు విషయాలు వక్రీకరిస్తే మాత్రం ఉపేక్షించవద్దని మంత్రు గట్టిగా కోరినట్లు తెలుస్తోంది. ఈరోజు నుంచే సోషల్ మీడియాపై పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే సోషల్ మీడియాపై ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీలో కూడా చర్చించాలని ఆదేశించింది. వైసీపీ నేతలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం నుంచి దృష్టి మరల్చేందుకు కొత్త పద్ధతి ఎన్నుకున్నారని మంత్రులకు సీఎం చంద్రబాబు చెప్పారు. వారు కావాలని ఎమ్మెల్యేలను రెచ్చగొడుతున్నారని... వైసీపీ వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని సూచించారు. వైసీపీ ట్రాప్లోకి లాగేందుకు చూస్తోందని.. జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతపురం సహా మిగతా జిల్లాలలో జరిగిన సంఘటనలను ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. ఇన్ఛార్జి మంత్రులు జిల్లాలకు వెళ్లిన సమయంలో ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇన్ఛార్జి మంత్రులు.. రెవెన్యూ, ఇతర సమస్యలపై కూడా ఫోకస్ పెట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

# బహుజన విద్యార్థుల బతుకుల కంటే 'మూసీ' ముఖ్యమా?

### గురుకులాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వానికి బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ డిమాండ్

**హైదరాబాద్, 10 జులై 2026(జై భీమ్ న్యూస్)**



రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురవుతున్న ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, ప్రభుత్వం మూసీ ప్రాజెక్టుకు రూ. 7,345 కోట్లు కేటాయించడాన్ని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహుజన విద్యార్థుల ప్రాణాలు, వారి సంక్షేమం కంటే మూసీ నది అభివృద్ధే ప్రభుత్వానికి ముఖ్యమైందా అని ప్రశ్నించారు. మూసీ నది ప్రక్షాళన కంటే ముందు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ఇప్పటికీ కనీస మౌలిక వసతులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు లేక విద్యార్థులు, ముఖ్యంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్య, సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. నాగర్కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో ఫుడ్ పాయిజనింగ్ కారణంగా సుమారు 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న ఆయన, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. "నేటి బాలలే రేపటి పౌరులు" అని గుర్తు చేసిన ఇబ్రాం శేఖర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు గురుకులాల్లో అన్ని కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా, మూసీ ప్రాజెక్టుకు వేల కోట్ల రూపాయలు కేటాయించిన కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమంపై కూడా అదే స్థాయిలో దృష్టి సారించాలని, పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇబ్రాం శేఖర్ కోరారు.

# కాజీపేట రైల్వే పోలీసుల అప్రమత్తత..

### వృద్ధురాలికి అండగా నిలిచి, మైనర్ బాలికను రక్షించిన పోలీసులు






**కాజీపేట, 10 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

కాజీపేట రైల్వే పోలీసు బలగాలు మానవత్వాన్ని చాటుతూ ఓ వృద్ధురాలిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు చేరవేయడంతో పాటు, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా మరో మైనర్ బాలికను రక్షించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించాయి. ఏలూరు జిల్లా మూలలంక గ్రామానికి చెందిన జి. విజయలక్ష్మి (80) విజయవాడ నుంచి కాశీకి వెళ్లాల్సి ఉండగా, పొరపాటున సంఘమిత్ర ఎక్స్ప్రెస్ రైలును ఎక్కింది. దీంతో ఆమె ముందుగా కాగజ్నగర్ రైల్వే స్టేషన్కు చేరుకుని, అక్కడి నుంచి మరో రైలులో కాజీపేట రైల్వే స్టేషన్కు వచ్చింది. అక్కడ ఏం చేయాలో తెలియక ఆందోళనగా తిరుగుతుండగా విధుల్లో ఉన్న రైల్వే హెడ్ కానిస్టేబుళ్లు ఆమెను గుర్తించి వివరాలు సేకరించారు. వృద్ధురాలు తెలిపిన సమాచారం ఆధారంగా ఆమె కుటుంబ సభ్యులను సంప్రదించి, వారు వచ్చే వరకు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్లో అవసరమైన సౌకర్యాలు కల్పించారు. అనంతరం హైదరాబాద్కు చెందిన ఆమె కుమారుడు జి. భవానీ శంకర్కు వృద్ధురాలిని క్షేమంగా అప్పగించారు. ఇదే సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా కాజీపేట ముస్కాన్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా, ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని జంజ్గీర్--చాంపా జిల్లా సబరియా డేరా ప్రాంతానికి చెందిన నిర్మలా సాహు (17) అనే మైనర్ బాలికను గుర్తించి రక్షించింది. బాలిక తన కుటుంబ సభ్యుల వివరాలను వెల్లడించకపోవడంతో, ఆమె భద్రతను దృష్టిలో ఉంచుకుని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులకు అప్పగించారు. తప్పిపోయిన మహిళలు, చిన్నారులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు చేర్చడం, అవసరమైన రక్షణ కల్పించడం వంటి చర్యల్లో కాజీపేట రైల్వే పోలీసులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తూ మానవతా సేవలను అందిస్తున్నారని అధికారులు తెలిపారు.

జై భీమ్ POWER OF PEOPLE

# కొత్త కథనంతో వచ్చిన లెనిన్

## షూటింగ్‌ల ఒత్తిడి నుంచి రెస్ట్

### యూరప్ టూర్ వెళ్లనున్న ప్రభాస్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్', హను రాఘవపూడి డైరెక్షన్‌లో వస్తున్న 'ఫౌజీ' చిత్రాలతో పాటు బ్లాక్‌బస్టర్ హిట్స్ 'సలార్', 'కల్కి 2898 ' సీక్వెల్స్ కూడా ఆయన చేతిలో ఉన్నాయి. అయితే.. బ్యాక్ టు బ్యాక్ షూటింగ్‌లతో తీరిక లేకుండా గడుపుతున్న ప్రభాస్, త్వరలోనే కాస్త బ్రేక్ తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ హైదరాబాద్‌లో 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. హీరో ప్రభాస్ మరియు హీరోయిన్ త్రిప్తి డిమ్రి పై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. ఇక స్పిరిట్ లేటెస్ట్ షెడ్యూల్ పూర్తయిన వెంటనే ప్రభాస్ ఒక చిన్న విరామం తీసుకోనున్నారు. సుమారు పదిరోజుల పాటు వెకేషన్ కోసం ఆయన యూరప్ వెళ్లనున్నట్లు సమాచారం. యూరప్ టూర్ ముగించుకుని తిరిగొచ్చిన తర్వాత, ప్రభాస్ తన పూర్తి ఫోకస్‌ను 'ఫౌజీ' సినిమాపై పెట్టనున్నట్టుగా తెలుస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడిక్ లవ్ స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంతో ఇమాన్వి హీరోయిన్‌గా పరిచయమవుతోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకోగా.. బ్యాలెన్స్ షూటింగ్‌ను కంప్లీట్ చేసే ఎ÷–లానింగ్‌లో ఉన్నాడు డార్లింగ్. ఆ తర్వాత స్పిరిట్ పూర్తి చేసి.. కల్కి 2 సెట్స్‌లో జాయిన్ అవనున్నాడు. ఇక ఆ తర్వాత సలార్ 2 సెట్స్ పైకి వెళ్లనుంది. ప్రస్తుతానికి ప్రభాస్ ఈ భారీ లైనప్‌తో బిజీగా ఉన్నాడు. అందుకే.. ఒక స్మాల్ బ్రేక్ తీసుకుంటున్నాడని చెప్పొచ్చు.

## లెనిన్ టీమ్‌కు సమంత విషెస్




అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన 'లెనిన్' చిత్రం ప్రేక్షకుల ముందుకు రావడంతో సినీ పరిశ్రమ నుంచి ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా స్టార్ హీరోయిన్ సమంత చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినిమా విడుదల రోజునే 'లెనిన్' ట్రైలర్‌ను షేర్ చేస్తూ చిత్ర బృందానికి ఆమె బెస్ట్ విషెస్ తెలియజేయడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సమంత తన పోస్ట్‌లో.. ఇప్పటికే బ్లాక్‌బస్టర్ వైబ్స్ కనిపిస్తున్నాయి. మొత్తం టీమ్‌కు ఆల్ ది బెస్ట్ అంటూ శుభాకాంక్షలు తెలిపింది. ముఖ్యంగా అఖిల్‌కు కూడా విజయాన్ని ఆకాంక్షిస్తూ ఆమె చేసిన ఈ పోస్ట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఇటీవల సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఆ సినిమా గురించి 'లెనిన్' ప్రమోషన్స్‌లో అఖిల్ కూడా సానుకూలంగా స్పందించారు. షూటింగ్ పనుల్లో బిజీగా ఉండటంతో ఇంకా సినిమా చూడలేదని చెబుతూ, లేడీ ఓరియెంటెడ్ చిత్రంలో యాక్షన్‌కు ప్రాధాన్యం ఇవ్వడం తనకు నచ్చిందని, సమంతకు మంచి విజయం దక్కడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు అఖిల్ సినిమాకు సమంత కూడా అదే తరహాలో శు భాకాంక్షలు తెలియజేయడంతో ఇద్దరి మధ్య ఉన్న పరస్పర గౌరవం మరోసారి హైలైట్ అయింది. వ్యక్తిగత అంశాలను పక్కనబెట్టి మంచి సినిమాలను, సహచర నటీనటులను ప్రోత్సహించడం ప్రశంసనీయమని సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి.

### అఖిల్ నటనా తీరు అద్భుతం

టైటిల్ ప్రకటించిన నాటి నుంచీ అఖిల్ 'లెనిన్' సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అఖిల్ రగ్గడ్ గెటప్, కథా నేపథ్యం, ప్రచార చిత్రాలు, విడుదలైన పాటలు.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందని ఆడియన్స్ ఫిక్సయిపోయారు. అఖిల్ కెరీర్‌లో 'లెనిన్'కి వచ్చినంత హైప్ మరే సినిమాకూ రాలేదన్నది నిజం. ఎట్టకేలకు ఈ శుక్రవారం 'లెనిన్'గా అఖిల్ థియేటర్లలోకి అడుగపెట్టాడు. ఇది రాయలసీమలోని రామాపురం అనే గ్రామం పగలకు, ప్రతీకారాలకు దూరంగా ఉంటుంది. రక్తం ఆ నేలను అప్పటివరకూ తాకలేదు. ఆ ఊరిలో సంప్రదాయ జాతర జరుగుతుండగా, ఓ పదేళ్ల పిల్లాడు ఆ ప్రాంతంలోకి అడుపెట్టాడు. అ పిల్లాడి పేరు 'లెనిన్'. అమ్మానాన్న లేని అనాథ అయిన లెనిన్‌ని ఆ ఊరి పెద్దావిడ(ఈశ్వరీరావు) అక్కున చేర్చుకుంది. ఆమె కొడుకైన వసంత్(ప్రమోద్ పంజు)తో లెనిన్‌కి బలమైన స్నేహబంధం ఏర్పడింది. వసంత్‌తో పాటు లెనిన్ కూడా ఆ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు.. కట్ చేస్తే.. కొన్నేళ్ల తర్వాత లెనిన్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ ఊరిలోకి అడుగుపెట్టి ఆ ఊరి జనాలైన వందమందిని నరికి చంపాడు. చివరకు తన ప్రాణస్నేహితుడైన వసంత్‌ని కూడా అతి దారుణంగా పొడిచి చంపాడు. అసలు లెనిన్ జైలుకి ఎందుకెళ్లాడు? రక్తం రుచే తెలియని ఆ నేలపై రక్తపాతం ఎందుకు సృష్టించాడు? ప్రాణ స్నేహితుడైన వసంత్ ప్రాణాన్ని ఎందుకు బలి తీసుకున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ. పరువు, ప్రేమ, స్నేహం, నమ్మకద్రోహం నేపథ్యంలో సాగే కథ ఇది. కథకుడు, దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరి ఈ కథను నడిపించిన తీరు బావుంది. ఇదొక విభిన్నమైన స్క్రీన్‌ప్లే. ప్రథమార్థం ఇదేదో పరువు కోసం ప్రాణాలు తీసే వ్యక్తుల చుట్టూ తిరిగే కథగానే అంతా భావిస్తారు. కానీ సెకండాఫ్‌లో ఈర్ష్య, ద్వేషం, నమ్మకద్రోహం కోణాలు కథలో బహిర్గతమవుతాయి. ఈర్ష్య, ద్వేషం అనేవి పవిత్రమైన స్నేహాన్ని సైతం నిర్వీర్యం చేస్తాయని ఈ కథ ద్వారా మురళీకిశోర్ అబ్బూరి తెలిపారు. అనాథగా ఆ ఊరు వచ్చిన లెనిన్ 'నా' అనుకున్న వారందర్నీ సంపాదించుకున్నానని భ్రమ పడతాడు. తాను ఎప్పటికీ అనాథనేనని తెలుసుకుకోవడంతో కథ ముగుస్తుంది. స్నేహానికీ,




ప్రేమకీ లొంగిపోయే లెనిన్ నమ్మకద్రోహానికి బలైపోయాడు. అదే ఈ సినిమా కథ. చాలా సీరియస్ స్జబెక్ట్ ఇది. క్షణక్షణానికి మారుతున్న వ్యక్తులు మనస్తత్వాలను ఈ సినిమాలో చూడొచ్చు. మంచి వాళ్ళుగా కనిపిస్తున్న మేకవన్నె పులుల మధ్య జీవితాన్ని సాగించి, సర్వం కోల్పోయిన లెనిన్‌ని ఈ సినిమాలో చూడొచ్చు. ప్రథమార్థం చివరి ఇరవై నిమిషాల్లో సినిమాలోని అసలు కథ మొదలైంది. కథలోకి వెళ్లడం ఆలస్యం కావడం వల్ల కథనం నిదానించినట్టు అనిపిస్తుంది. ద్వితీయార్థం ఆద్యంతం ఊహించని మలుపులతో ఆసక్తికరంగా సినిమా సాగింది. మొత్తంగా దర్శకుడు మురళీకిశోర్ వైవిధ్యమైన కథనంతో ఈ కథను నడిపించి సినిమాను నిలబెట్టారు. ఇక 'లెనిన్'గా కొత్త అఖిల్‌ని ఈ సినిమాలో చూస్తారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ ఒకెత్తూ, 'లెనిన్' ఒకెత్తు.

అమాయకత్వం, మంచి తనం, మూర్ఖత్వం కలగలిసిన ఈ పాత్రలో అఖిల్ జీవించాడనే చెప్పాలి. అతనిలోని పరిపూర్ణమైన నటుడ్ని 'లెనిన్'లో చూడొచ్చు. ముఖ్యంగా ద్వితీయార్థంలో అఖిల్ అద్భుతంగా నటించాడు. అతని కెరీర్‌లో బెస్ట్ పెర్‌ఫార్మెన్స్‌గా 'లెనిన్'ని చెప్పొచ్చు. ఇక భాగ్యశ్రీబోర్సే తనదైన అందచందాలతోపాటు చక్కటి అభినయంతో కూడా ఆకట్టుకున్నది. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వసంత్‌గా నటించిన ప్రమోద్ పంజు గురించి. తనది ఇందులో మేకవన్నె పులి లాంటిపాత్ర. మంచివాడిగా కనిపిస్తూ ఉన్నట్టుండి దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ అయ్యే పాత్ర అది. ఆ పాత్రలో తన నిజంగా అదరహో అనిపించాడు. ఈ సినిమాతో అతనికి మంచి పేరు రావడం ఖాయం. ఇక శివాజీ, ఈశ్వరీరావు, రాంకీ.. ఇలా అంతా పరిధిమేర పాత్రలకు న్యాయంచేశారు.

# విజయ్ జన నాయగన్‌కు ఎ సర్టిఫికెట్

### పలు మార్పులు సూచించిన సెన్సార్ బోర్డు

తమిళనాడు సీఎం, నటుడు విజయ్ కథానాయకుడిగా, హెచ్.వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన 'జన నాయగన్' చిత్రం ఎట్టకేలకు సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. దాదాపు ఏడు నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత సెన్సార్ బోర్డు ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. అయితే మొత్తం మూడు గంటల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో దాదాపు 12 కీలక మార్పులు చేయాలని బోర్డు సూచించింది. ఇందులో భాగంగా విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను పూర్తిగా తొలగించాల్సి ఉంటుందని. అలాగే 'అంబేద్కర్ చట్టం' అనే డైలాగ్‌ను మార్చాలని, ఓ పుస్తకం కవర్‌పై అంబేద్కర్ ఉన్న విజువల్స్‌ను సవరించాలని బోర్డు స్పష్టం చేసింది. ఇక దేశభక్తికి సంబంధించిన అంశాల్లో భాగంగా భారత జాతీయ జెండా కింద పడుతున్నట్లు ఉన్న ఒక కీలకమైన షాట్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. వీటితో పాటు సినిమాలో 'రంగనాథర్', 'ఓం' అనే పదాలతో పాటు 'ఆపరేషన్ మేలుహా' వివరణలో వచ్చే 'న్యూ ఇండియా' అనే పదాన్ని మ్యూట్ చేయాల్సిందిగా పేర్కొంది. సమాజంలో సున్నితమైన అంశాలకు సంబంధించి ఒక చిన్నారిని తగలబెడుతున్నట్లు ఉన్న విజువల్స్‌ను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో వేరే విజువల్స్ రీప్లేస్ చేయాలని బోర్డు వెల్లడించింది. అలాగే సినిమాలో 'షీలా రాణి' అనే పేరు ఎక్కడ వచ్చినా మార్చాలని, అంతర్జాతీయ అంశాలకు సంబంధించిన సద్దాం హుస్సేన్ ఉరితీత డైలాగ్‌ను కూడా మ్యూట్ లేదా రీప్లేస్ చేయాలని సూచించింది. వీటితో పాటు మరికొన్ని సన్నివేశాల్లో వచ్చే వివాదాస్పద పదాలను కూడా మ్యూట్ చేయాలని సెన్సార్ బోర్డు ఆదేశాల జాబితాలో పేర్కొంది. ఈ సినిమాలో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించగా, మమితా బైజు కీలక పాత్ర పోషించిన ఈ చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ భారీ మార్పులన్నింటినీ పూర్తి చేసుకుని జులై 24న 'జన నాయగన్' థియేటర్‌లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.






# రోషన్ కనకాల కొత్త మూవీ ప్రారంభం

టాలీవుడ్ యువ నటుడు రోషన్ కనకాల కథానాయకుడిగా ఓ వినూత్నమైన భారీ ప్రాజెక్ట్ అధికారికంగా పట్టాలెక్కింది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా, సరికొత్త సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. వైవిధ్యభరితమైన కథలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట అయిన ప్రముఖ దర్శకుడు వి.ఐ. ఆనంద్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి కథ, స్క్రీన్‌ప్లే అందించడమే కాకుండా, స్వయంగా సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. ఈ చిత్రంతో విజయ్ కె. కమిశెట్టి దర్శకుడిగా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ, ప్రేమ, వినోదం వంటి అన్ని రకాల వాణిజ్య అంశాలను కలగలిపి ప్రేక్షకులను ఒక సరికొత్త ఊహాజనిత ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ కథను సిద్ధం చేశారు. ఈ చిత్రంలో రోషన్ కనకాల సరసన గహాజీ కథానాయికగా నటిస్తోంది. ఇక అత్యంత వైభవంగా జరిగిన ఈ ముహూర్తు వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు బెస్ట్ విషెస్ తెలియజేశారు. యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టగా, టాలీవుడ్ టాప్ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్ర బృందాన్ని ఆశీర్వదించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా టైటిల్‌ను మేకర్స్ ప్రస్తుతం సస్పెన్స్‌గా ఉంచారు, త్వరలోనే టైటిల్ మరియు పూర్తి నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు. అన్ని హంగులు అద్దుకుని త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది.